# పర్యవసానం

"అమ్మ! అబ్బ! ఉష్!" అనుకుంటూ ఇక ఎక్కలేక ఆయాసంతో మెట్ల మీద చతికిలబడ్డ ధర్మారావుని ఛీత్కారంగా చూసి తనకేమీ పట్టనట్లు నిర్లక్ష్యంగా లోపలికెళ్లిపోయాడు సుదర్శన్.

తన్ని చూసి జాలితో ఎదురొచ్చి కొడుకు తన చేతిలోని కూరల సంచీలందుకుంటాడని ఆశించిన ధర్మారావు, కొడుకు చూపుల్లోని భావం అర్ధమయి నిరుత్సాహపడి బాధగా మూలిగి, భుజానున్న ఉత్తరీయంతో ముఖానికి పట్టిన చెమట తుడుచుకుని, ఓ నిమిషం ఆగి మళ్ళీ సంచులందుకుని కాళ్ళీడ్చుకుంటూ లోపలికెళ్ళి–

"తాయారూ!" అంటూ భార్యని పిల్చి సంచులందించి "ఉష్" అనుకుంటూ వసారాలో వున్న నులకమంచంమీద నడుం వాల్చాడు.

"తోటకూర, బచ్చలికూర, వంకాయ, దొండకాయ, – బజార్లో మరేం కూరలు లేనట్లు ఎప్పుడూ ఒకటే కూరలు" అంటూ విసుక్కుంటూనే ధర్మారావు తెచ్చిన కూరల్ని సర్ది–

"ఊ– రండి వడ్డించాను" అంది తాయారు.

కంచం ముందు కూర్చున్న ధర్మారావు గోంగూర పచ్చడి, చారు అన్నం తిన్న తరువాత మజ్జిగ పోయించుకుని తినేసి ఆఖర్ని గ్లాసులో నీళ్ళు కంచంలో పోసి కంచం అంచుల్ని అంటిన మజ్జిగని ఆ నీళ్ళతో కడిగి అవీ తాగేసి, తన అలసట, ఆకల్ని తీర్చుకున్నాడు.

"పిల్లలు భోంచేశారా?" అని లేస్తూ అడిగినదానికి –

"ఆ– చేశారు. మీరొచ్చేవరకు ఎక్కడ ఆగగలరు? సాయంకాలం టిఫినుండదు సరికదా నమలడానికి జంతికముక్కల్లాంటివన్నా వుండవాయె! ఈ పూటా, ఆ పూటా పెట్టే పచ్చడి మెతుకులన్నా కనీసం వేళకి పెట్టకపోతే ఎలాగ?" అంటూ భర్త కంచం ఎత్తి ఎంగిలెత్తసాగింది తాయారమ్మ.

"పాత కాకినాడ నుంచి కూరలు తేవాలంటే ఈ మాత్రం టైము అవదూ?" అంటూనే అక్కడినుంచి వెళ్ళిపోయాడు ధర్మారావు.

"చీకటిపడ్డాక వెళ్తే దొరికే ఆ చచ్చు పుచ్చుకూరలు ఇక్కడ మార్కెట్‌లోనూ దొరుకుతాయి. నాలుగుపైసలు చవగ్గా ఇస్తాడని అంతదూరం పోవడం – పోనీ వెళ్ళిన మనిషి ఓ పావలా డబ్బులు పడేసి రిక్షా ఎక్కి రావొచ్చుకదా? ఓపిక లేనప్పుడు ఎందుకా నడక?" అంటూ

లోపలినుంచి సుదర్శన్ గట్టిగానే అన్న మాటలు చెవిని పడ్డా తన్ని కానట్లే గదిలోకి వెళ్లిపోయాడు ధర్మారావు.

'కలిగి ఖర్మ – లేక దరిద్రం' అన్న సామెత బహుశా ధర్మారావు పుట్టేకనే పుట్టివుండాలి. సామెతలోని రెండో కోవకి చెందిన వ్యక్తుల్ని చూస్తే లోకం జాలి పడుతుంది.

కానీ మొదటి కోవకి చెందిన వ్యక్తుల్ని చూస్తే లోకమే కాదు బంధుమిత్రులతోపాటు ఇంట్లోవాళ్ళు కూడా చీదరించుకుంటారు.

కానీ ఇక్కడో తమాషా ఏమిటంటే లోకులేకాకుండా సొంతవాళ్ళు కూడా ఇలాంటి వాళ్ళని ముఖంమీద దులిపేసి, వెటకారమాడినా పట్టించుకోడంగానీ, సిగ్గు పడటంగానీ వుండదు. దానిక్కారణం వారికి డబ్బే ప్రధానం కావడం. అదే కోవకి చెందినవాడు ధర్మారావు.

ధర్మారావు చేసింది పెద్ద ఉద్యోగమే! ఒక్క జీతమే కాకుండా లక్షల విలువ చేసే ఆస్తి తండ్రి తదనంతరం సంక్రమించింది వుంది. కానీ ప్రతీ పైసానీ పది రూపాయలంత భద్రంగా వాడతాడు.

ప్రతిపనీ వ్యాపారదృష్టితో ఆలోచించి మరీ చేస్తాడు. ప్రతీ సెకను 'అతితక్కువ ఖర్చుతో జీవితాన్ని ఎలా సాగించాలి' అని ఆలోచిస్తాడు.

కూరలు కొనడానికి మార్కెట్‌కి వెళ్ళడం కూడా బాగా పొద్దుపోయి, దుకాణాలు మూసేసే టైముకి వెళ్తాడు. అదీ – ఎంతో దూరంలో వున్న గుత్తగా అమ్మే దుకాణాలకే వెళ్తాడు. వెళ్ళినా – ముందు అన్ని దుకాణాలూ తిరిగి, ఖరీదులు అడిగి, ఎక్కడ చవకో అక్కడికి మళ్ళీ వచ్చి కొంటాడు.

ఆ కొనే కూరలు కూడా కాలీఫ్లవరు, బంగాళాదుంపవంటి ఖరీదైన కూరలు, తొక్కలు తీసిపారేసేవి దండగని కొనడు. చవగ్గా వుండేవి, ఆకుకూరల్లాంటివి– ముచికలు మాత్రం పోను, కొన్న సరుకంతా పూర్తిగా వండడానికి ఉపయోగపడేవే చూసి తెస్తాడు. రేషన్‌లో బియ్యం తప్ప బైటకొనడు. పప్పు పులుసుల్లాంటివి ఏ పండక్కో తప్ప వండనివ్వడు.

ఇలా ఇంట్లో తిండే లెక్కపెట్టి లెక్కపెట్టి తినడం కాదు. బట్టల విషయంలోనూ అంతే – మగపిల్లలిద్దరికీ సైనుగుడ్డ షర్టులు, డ్రిల్లుగుడ్డ నిక్కర్లు, ఆడపిల్లకీ ఆ సైనుగుడ్డ గౌన్లే!

భార్య నేతచీరలు అరవై, నలభై నెంబర్లవి తప్ప మరొకటి ఏనాడూ కట్టి ఎరగదు. పెళ్ళిలో పుట్టింటివారు పెట్టిన పుస్తెలతాడు, జతగాజులూ తప్ప మరో నగ ముఖం చూసి ఎరగదా ఇల్లాలు.

అవి కూడా అరిగి విరిగిపోయినప్పుడు ఇంత టంకం పెట్టించి తెస్తాడేతప్ప చెరిపించి చేయిస్తే దండగని ఒప్పుకోడు. నెల ఖర్చంతా ధర్మారావు చేతిమీదే జరగాలి. భార్య చేతికి నయాపైస ఇవ్వడు.

ఏ అచ్చటా ముచ్చటాలేని పిసినిగొట్టు భర్తతో విసిగిపోయి "ఇక నా ఖర్మ ఇంతే!" అని వూరుకుందా ఇల్లాలు.

ఇరుగుపొరుగు ఆడవాళ్ళు భర్త పీనాసితనం గురించి ఆమె ముఖంమీదే ఎగతాళిగా ఆడే మాటలు వినలేక ఇల్లు దాటి బైటికెళ్లేది కాదు.

తోటిపిల్లలు ఆడుకునే బొమ్మల్ని చూసి తమకీ కావాలని పిల్లలు ఏడ్చినా, ఐస్‌క్రీమ్‌లు, తిండి సామాన్లవంటివి బైటిపిల్లలు తింటుంటే తమకీ కొనమని పేచీ పెట్టినా కొనివ్వడానికి చేతిలో పైసలుండక ఆ ఇల్లాలు, ఏడుస్తున్న పిల్లల్ని నాలుగు తన్ని ఇంట్లోకి లాక్కొచ్చి కొట్టేనని బాధతో తానూ దుఃఖించేది.

బజార్లో సరుకుల ధరలు పెరగడంతో ఇదివరకులా 'ఇంత డబ్బుతోటే ఇల్లు గడపాలి' అన్న నియమం ధర్మారావుకి సాగటంలేదు. పదిరూపాయలు అధికంగా ఖర్చయినా బెంగ పడిపోతున్నాడు.

జీతమంతా ఇంటికి తెస్తే ఏదో ఖర్చు కనపడి, అయిపోతుందన్న భయంతో జీతం అందుకోగానే అటునుంచి అటే బ్యాంక్‌లో రికరింగ్ పడేసి, ఆ నెలకి ఖర్చు చెయ్యదలచిందే ఇంటికి తెచ్చి తన పెట్లో పెట్టి తాళంవేసి బొడ్లో ఆ తాళం దోపుకునేవాడు.

తుంగచాపలు, నులకమంచాలే ఆ ఇంట్లోవారికి రాత్రికి పడకలు, పగలు ఎవరన్నా వస్తే అవే వారికి కూర్చునే సోఫా డన్‌లప్‌లు.

కొడుకులిద్దరూ ఎదిగారు. కాలేజీల్లో చేరారు. ఆడపిల్ల పెళ్ళికెదుగుతోంది. అయినా ధర్మారావులో ఏమాత్రం మార్పు రాలేదు. ఎదుగుతున్న ఆడపిల్ల పెళ్ళికయ్యే ఖర్చు గురించి తల్చుకొని బెంగతో నిద్రపోయేవాడు కాదు.

కూతుర్ని పదోతరగతి తోటే 'ఆడపిల్లకి చదువెందు'కని మాన్పించేశాడు. 'చదివించినా పెళ్ళిఖర్చు తప్పదుకదా!' అని అతని ఉద్దేశం. తప్పనిసరయి కొడుకుల్ని మాత్రం డిగ్రీల్లో చేర్పించాడు.

కాలేజీలో తోటిపిల్లలు సుదర్శన్, సుధాములు వేసుకొనే డ్రస్సుల్ని చూసి ఎగతాళి చేసి ఏడిపిస్తుంటే అవమానం, సిగ్గుతో ఇంటికొచ్చి తల్లిదగ్గర బాధపడేవారు.

తాయారు పిల్లల బాధని భర్తతో చెప్పజూస్తే "ఏడిశారు వెధవలు – బట్టలకీ, చదువుకీ సంబంధమేమిటి? ఖరీదైన బట్టలేసుకున్నవాడు ఫస్టొస్తాడా? పైజామా వేసుకున్నవాడు ఫెయిలవుతాడా? మన చవటలకి అక్కడ మాట్లాడడం రాక ఇంట్లో ఏడుస్తారు" అనేవాడేతప్ప సరదాకి ఒక టెరీకాట్ షర్టన్నా కొనేవాడు కాదు.

ఇంట్లో కూర్చునే భావనకి కూడా అన్నగార్లలా చదువుకోవాలని వుండేది. కానీ అదీ ఇంట్లో తీరని కోరికని తెలిసి తండ్రిని అడగలేక, కోరికని చంపుకోలేక అన్నగార్లు కాలేజీనుంచి వచ్చాక వారి పుస్తకాలు తీసుకుని చదివి, తెలియనివి వాళ్ళనడిగి తెలుసుకునేది.

ఇంట్లోనే వుండే తాయారమ్మా, భావనలు ధర్మారావు ప్రవర్తనకి అలవాటుపడ్డా, బైట తిరిగే సుదర్శన్, సుధాములు మాత్రం. తండ్రి పిసినారితనానికి విసిగిపోయి తండ్రంటే

చులకనభావం, నిర్లక్ష్యం రోజురోజుకీ పెరిగి, తండ్రిని ఖాతరుచెయ్యడం మానేశారు. తండ్రి ఏం చెప్పినా నిర్లక్ష్యంగా విననట్లు వెళ్ళిపోయేవారు.

ధర్మారావుకి ఫీజు కట్టడానికి తప్ప పిల్లల చేతిలో డబ్బులు పెట్టేవాడు కాదు. తోటిపిల్లల్ని, వారు పెట్టే ఖర్చుల్ని చూసే వీరిలోనూ ఎన్నో కోరికలు, సరదాలూ కలిగినా చేతిలో డబ్బుల్లేక ఆ కోరికల్ని అణచిపెట్టుకున్నకొద్దీ, వారికి తండ్రి మీద కోపం, కసీ పెరిగి, ధర్మారావు ఎదుటపడగానే ఒళ్లంతా భగ్గున మండినట్లయి, ఛీత్కారంగా తండ్రినోచూపు చూసి, అతన్ని తప్పించుకుని పక్కగదిలోకి వెళ్లిపోయేవారు.

డబ్బే ప్రాణం, ప్రధానంగా చూసుకునే ధర్మారావు కొడుకుల ప్రవర్తన పసికట్టినా చూడనట్లే వూరుకునేవాడు.

కాలం మరో రెండేళ్ళని నడిపించేసింది. సుదర్శన్ బ్యాంక్ పరీక్షలు రాసి సెలక్టయ్యాడు. సుధామ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా జాయినయ్యాడు.

కొడుకులిద్దరూ ఉద్యోగాల్లో స్థిరపడగానే ధర్మారావు కొచ్చిన ఆలోచన - ముందుగా కూతురి పెళ్ళిచేసేస్తే, తరువాత పెద్ద పెద్ద మొత్తాలు కట్నాలుగా తెచ్చే ఇంటో పిల్లల్ని చూసి కొడుకులకి పెళ్ళిళ్ళుచేసి ఆ డబ్బుకూడా మరో కొన్ని డిపాజిట్లు వేసెయ్యాలన్నది.

దాంతో భావనకి సంబంధాలు వెతకడం ప్రారంభించాడు.

ఎక్కడికెళ్ళినా కట్నం తీసుకోకుండా తన కూతుర్ని వారింటి కోడలిగా చేసుకుంటామన్న ఉదారులు కనపడలేదు ధర్మారావుకి.

విసిగిపోయిన ధర్మారావుకి పెళ్ళిళ్ళ పేరయ్య చూపించిన ఓ సంబంధం అన్నివిధాలా నచ్చింది. పిల్లాడు పదోక్లాసు తప్పి అటెండర్‌గా బ్యాంకులో పనిచేస్తున్నాడు. దిక్కూమొక్కూలేని అబ్బాయి కూడా.

వెంటనే ముహూర్తం పెట్టించి, అతితక్కువ ఖర్చుతో భావన పెళ్ళి సింపుల్‌గా చేసి 'హమ్మయ్య' అనుకుని గుండెమీదనుంచి చేతులు దింపుకుని ఆనందపడిపోయాడు ధర్మారావు, తన తెలివికి తానే ఆనందపడిపోతూ.

సుదర్శన్, సుధామలు చెల్లెలికీసంబంధం చెయ్యడం ఏమాత్రం ఇష్టంలేక తండ్రికి ఎదురుతిరిగి పోట్లాడినా విజయం ధర్మారావునే వరించడంతో ఏమీ చెయ్యలేక మరింత కసీ, ద్వేషం తండ్రిపట్ల పెంచుకుని, బాధ, జాలితో చెల్లెల్ని అత్తవారింటికి పంపారు.

ఫస్టు తారీకున కొడుకులిద్దరూ ఇంటికి రాగానే వారి వెంటవెంట తిరగసాగాడు ధర్మారావు. కొడుకులిద్దరూ ధర్మారావుని పట్టించుకోనట్లే వారి పన్లు వారు చూసుకోసాగారు.

ఇక వుండబట్టలేక రాత్రి భోజనాల దగ్గర "మీ జీతాలొచ్చాయ్రా?" అని అడగ్గానే కొడుకులిద్దరూ ఒకేసారి "ఊ" అన్నారు విసుగ్గా.

"ఏదీ ఎక్కడ పెట్టారు?" అనగానే విసురుగా లేచి వెళ్ళి, ఇద్దరూ చెరో యాభైయ్యేసి రూపాయలూ తెచ్చి తండ్రిచేతిలో పెట్టారు.

"ఇదేమిటి? ఇంతేనా?!" అంటూ ఆశ్చర్యపోతున్న తండ్రివంక వెటకారంగా చూశారు.

"మీరు ఇంటికి ఖర్చుచేసేది రెండొందలేగా అందులో మాకోసం ఖర్చు చేస్తున్నది యాభైయ్యేగనక మా, మా వాటా వందా తీసుకోండి" అనేసి వెళ్ళిపోయారిద్దరూ.

అవాక్కయి చూస్తూ వుండిపోవడం తప్ప ఏం చెయ్యలేని ధర్మారావు కాస్సేపటికి తేరుకుని కొడుకులిచ్చిన యాభై రూపాయల నోట్లని జేబులో పెట్టుకున్నాడు.

మర్నాడు కొడుకులిద్దరూ వేసుకున్న బట్టలు చూసి ధర్మారావుకి కళ్ళు తిరిగిపోయాయి. ఒక్కొక్కరి జత కనీసం అయిదారొందలు వుండొచ్చు. బూట్లు మూడు నాలుగొందలు వుండొచ్చు.

అలా ఒక్క రోజేకాదు - వారం పొడుగునా, వేసిన డ్రెస్సు వెయ్యకుండా ఆఫీసుకెళ్తున్న కొడుకుల్ని చూస్తుంటే మతిపోయినట్లుండేది ధర్మారావుకి.

వాళ్ళే కాకుండా ఇంట్లో తల్లికి కూడా ఖరీదైన చీరలు కొని తేవడంతో ఏం చెయ్యాలో అర్థంకాలేదు ధర్మారావుకి.

ఒకటి రెండుసార్లు అలా డబ్బు తగలెట్టొద్దని కొడుకులకి చెప్పజూసినా తండ్రిమాటలు విననట్లే లేచి వెళ్ళిపోయేవారు.

దాంతో భార్యకి చెప్పి కొడుకులకి చెప్పమనగానే "ఇన్నేళ్ళూ వాళ్ళు ఏ ముద్దూ, ముచ్చటా లేకుండా జీవితం గడిపారు. వాళ్ళకీ సరదాలనేవి వుంటాయి" అని భార్య చెప్పిన సమాధానంతో ధర్మారావు నోరు మూతపడ్డా, లోపల్లోపల వాళ్ళు పెడుతున్న ఖర్చులు చూసి గుండె బద్దలవుతున్నట్లుండేదతనికి.

మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టు కొడుకుల ప్రవర్తనతో దిగాలుపడిపోతున్న ధర్మారావుకి గుండాగిపోయే కబురు మరొకటి వినవలసివచ్చింది.

సుదర్శన్ తన తోటి ఉద్యోగస్తురాలిని రిజిస్టర్డు మేరేజ్ చేసుకున్నానంటూ ఓ సాయంకాలం పూలదండలతో కొత్తదంపతులు ఇంటికొచ్చేసరికి స్పృహతప్పి పడిపోయాడు.

ఈ సంఘటనతో రెండవవాడికన్నా త్వరగా పెళ్లిచేసి అతని కట్నకానుకలన్నా దక్కించుకుందామని, మర్నాటినుంచే సంబంధాలు చూడటం ప్రారంభించాడు.

పెళ్లిచూపులకి తయారవమని సుధామకి చెప్పిన సాయంత్రం చావుకబురు చల్లగా చెప్పినట్లు "నా పెళ్లి నిరుడే అయిపోయింది. త్వరలో మీకు మనవడు కూడా పుట్టబోతున్నాడు. అన్నయ్య పెళ్లికాగానే మీకీ శుభవార్త చెప్పాలని ఇన్నాళ్లూ ఆగాను. సాయంత్రం నేను మీ కోడల్ని తీసుకొచ్చి మీ ఆశీర్వచనాలు అందుకుంటాం" అని చెప్పిన చిన్న కొడుకు మాటల్ని గుడ్లు తేలేసి వింటూ కుప్పలా కూలబడిపోయిన తండ్రిని చూస్తూ వెటకారంగా ఓ నవ్వు నవ్వి బైటికెళ్ళిపోయాడు సుధామ.

కోడళ్ళిద్దరితో తాయారమ్మ హడావిడిగా ఇల్లంతా తిరిగేస్తూ పన్లు చేస్తోంది. కొడుకుల పెళ్లిళ్లకి వియ్యపురాలిగా తనకి ముద్దుముచ్చట్లు తీరలేదన్న బాధ ఆమెలో ఏ కోశానా కనపడటం లేదు. బామ్మనవబోతున్నానన్న ఆనందం ప్రతీక్షణం ఆమెలో కనబడుతోంది.

కోడళ్ళని కూతుళ్ళలా చూసుకుంటూ ఇంట్లో పన్లన్నీ చూసుకుంటూ ఆనందమంతా తనదే అన్నట్లు తాయారమ్మా తిరుగుతుంటే ఏకాకిగా మిగిలిపోయిన ధర్మారావు తన గది విడిచి బైటకి రాలేకపోయేవాడు.

'ఆనందంలో పరమానందం' అన్నట్లు ఆ రోజు ఉదయం కూతురూ అల్లుడూ ఊరినుంచి వచ్చి, తల్లిఒడిలో వాలుతూ – "అమ్మా! నేను బియ్యే ఎంట్రన్సు పాసయి, బియ్యే కూడా పూర్తిచేశాను. అన్నట్లు నేనేకాదు – మీ అల్లుడు కూడా బి.కాం. పాసయ్యారు.

అమ్మా! ఇదంతా అన్నయ్యల బలవంతం, ప్రోత్సాహంవల్లేనమ్మా! అన్నయ్యల అండే లేకపోతే మీ అల్లుడు అటెండర్‌గానే వుండిపోదురు. అలాంటిదిప్పుడు బ్యాంక్ పరీక్షలు రాస్తున్నారు. త్వరలో క్లరికల్ పోస్టు రావచ్చు. నేను కూడా బి.ఇడి. చేద్దామనుకుంటున్నానమ్మా" అంటూ భావన చెప్తున్న మాటలు శూలాల్లా తగిలి, తప్పుచేసినవాడిలా తలొంచుకుని కూర్చున్నాడు ధర్మారావు.

నిజానికి ఆ మాటలు ధర్మారావుకీ ఆనందాన్ని కలిగిస్తున్నా పైకి కనబర్చుకునే ధైర్యం లేక పక్కగదిలోకి తప్పుకున్నాడా పీనాసి/పిసినారి ఒంటరిపక్షి.

తాను అనుకున్నది ఒకటి, ఆ ఇంట్లో జరిగిందీ, జరుగుతున్నదీ మరొకటి. తన సలహా, సంప్రదింపులూ లేకుండా అన్ని పన్లూ జరిగిపోతున్నాయి.

ఇంట్లో నులకమంచాల జాగాల్లో డబుల్ బెడ్సు, డన్‌లప్ మేట్సు వచ్చాయి. కర్రల పొయ్యి జాగాలో గ్యాస్ స్టౌలు, తుంగచాపల జాగాల్లో సోఫాసెట్లు – ఇవి కాకుండా టీ.వీ., వీడియో, డైనింగ్ టేబిలు, డ్రెస్సింగ్ టేబిలులాంటి సామాన్లతో ఇల్లంతా నిండిపోయింది.

ఇంట్లో రెండుపూట్లా టిఫిన్లు, ఖరీదైన కూరలతో వంటలు పచ్చడి మెతుకులకి అలవాటుపడ్డ ధర్మారావుకా భోజనం పెట్టినా అరక్క అజీర్ణం పట్టుకునేదొక్కోసారి.

"నాన్నా! నాకు నీ వాచీ కావాలీ..." అంటూ మారాంచేస్తున్న రెండేళ్ళ కొడుక్కి చేతినున్న వాచీతీసి సుధామ యివ్వగానే అది పుచ్చుకుని నేలకేసి బాది ముక్కలు చేస్తున్న మనవడి చేతిలో వాచీ గబుక్కున లాక్కొని జేబులో పెట్టుకోగానే ఆరునొక్క రాగం తియ్యసాగాడు వాడు.

"పోనీలేరా తాత వాచీ లాక్కుంటే లాక్కోని – నీకింకా మంచిదిస్తాను తీసుకో, దీంతో ఆడుకో" అంటూ సుదర్శన్ తమ్ముడి కొడుకుముందు ట్రాన్సిస్టర్ పెట్టగానే దాన్ని వాడు బల్లమీంచి కిందకి తోసి, మళ్ళీ ఎత్తి నేలకేసి కొట్టగానే అద్దం పగిలి ముక్కలయింది.

అయినా కొడుకులు ఏమీ అనక ఆనందించడం చూసిన ధర్మారావు మనసు విలవిల్లాడి, వుండబట్టలేక మనవడి చేతిలోంచి దాన్ని అందుకోబోయాడు.

"ఆడుకోనీ నాన్నా దాంతో పిల్లాడిని! లాక్కోకు" అని కొడుకన్న మాటలకి - "వెయ్యి రూపాయల సరుకురా! వాడికి దాని విలువేం తెలుస్తుంది? తగలబెడితే మళ్ళీ కొనగలమా?" అన్నాడు.

"నీ సొమ్మేం కాదుకదా? నీ డబ్బంతా బ్యాంకుల్లోనే మూలుగుతోందిగా? అయినా ఏది శాశ్వతం? నువ్వా, నేనా? అదీ అంతే!!" అంటూ తండ్రిచేతిలోంచి ఆ ట్రాన్సిస్టర్ లాక్కొని మళ్ళీ పిల్లాడి ముందు పెట్టగానే మరేమీ మాట్లాడలేక బాధతో తన గదిలోకి వెళ్ళి తలుపులేసుకున్నాడు ధర్మారావు.

మనసులో రేగిన తుఫాను ఎలా చల్లార్చుకోవాలో అర్థం కావటం లేదు ధర్మారావుకి. తను పిల్లల్ని పెంచిన తీరుకి విరుద్ధంగా తన పిల్లలు వాళ్ళ పిల్లల్ని పెంచుతున్నారు. ఈ ఇంట్లో నేను బ్రతికుండగానే అన్నీ నాకు విరుద్ధంగానే జరుగుతున్నాయి. పిల్లలు నేనంటే ద్వేషాన్ని పెంచుకున్నారు. డబ్బు దుబారాగా ఖర్చు చేస్తున్నారు. నా జాగ్రత్తలో నూరో వంతు రాలేదేమిటి? నేను జాగ్రత్తచేస్తున్నది వాళ్ళ కోసమే కదా? కానీ వాళ్ళు నన్ను అర్థం చేసుకోరేమిటి? అసలు తప్పెక్కడుంది? అని ఆలోచిస్తుండగా భార్య గదిలోకి కాఫీగ్లాసుతో ప్రవేశించింది.

తాయారిచ్చిన కాఫీ అందుకుంటూ ఉండబట్టలేక తన కడుపులో బాధని భార్యకి చెప్పుకోసాగాడు ధర్మారావు.

అంతా విన్న తాయారమ్మ చిన్నగా నవ్వి -

"చూడండి - కాలం మారింది. మన కాలం అవసరాలు వేరు, ఈ కాలం అవసరాలు వేరు. పైగా పిల్లలకీ సరదాలూ, ముచ్చట్లూ వుంటాయి. నలుగురితో సమానంగా వుండాలను కోడం వాళ్ళ తప్పు కాదు.

మనం చేసిన పొరపాటల్లా చిన్నప్పటినుంచీ వాళ్ళకి ఏ ముద్దూ ముచ్చటా తీర్చకుండా, చేతికి ఒక్క పైస ఇవ్వకుండా బంధించేసి పెంచాం. దాంతో వారిలో ఇన్నేళ్ళుగా అణగారివున్న కోరికలు చేతిలోకి డబ్బులు రాగానే తీర్చుకుంటున్నారు. అంతేకాదు. మీవల్ల వాళ్ళు నలుగురిలో పొందిన అవమానం కసిగా మారి ఇప్పుడు మీమీద ఆ పగని ఈ విధంగా తీర్చుకుంటున్నారంతే! అది మన పెంపకదోషం తప్ప మరొకటి కాదు.

పిల్లలకి తిండిపెట్టి చదివించగానే సరికాదు. వాళ్ళకుండే సరదాలు, మనకున్న దాంతో తీర్చాలి. వాళ్ళ చేతికి డబ్బులిచ్చి పొదుపుగా ఖర్చుచెయ్యడం నేర్పాలే తప్ప కాళ్ళూ చేతులూ కట్టిపడేస్తే, ఒక్కసారిగా వాళ్ళ చేతిలో డబ్బులాడినప్పుడు జరిగే పర్యవసానమిలాగే వుంటుంది.

వాళ్ళల్లా వాళ్ళ పిల్లలుండకూడదన్న భావం నాటుకుపోవడంతో పాటు, మీ ఎదురుగా పిల్లాడికి ఖరీదైన సామాన్లిచ్చి పాడుచేయించి, మిమ్మల్ని బాధించి వాళ్ళ కక్ష కూడా తీర్చుకుంటున్నారు.

నిజానికి మీరు తినకుండా దాచి చివరికి ఇచ్చేది ఆ పిల్లలకే! కానీ వాళ్ళు మీ

తదనంతరం ఇవ్వబోయే ఆస్తి గురించి తల్చుకుని ఆనందిస్తున్నారా? లేక ప్రస్తుతం వున్నది ఖర్చుపెట్టుకుని అనుభవించి ఆనందిస్తున్నారా? ఆలోచించండి.

సరే ఇటు ఆడపిల్ల గురించే ఆలోచిద్దాం. చదువుకోవాలని సరదాపడింది. అది మనం తీర్చలేదు. దాని సరదాని తెలుసుకొన్న అన్నగార్లుండడంవల్ల, వాళ్లు ఖర్చుపెట్టి దాన్ని చదివించడంవల్ల దాని కోరిక తీరింది.

నిజానికి మన తాహతుకి మనకి వున్న ఒక్క ఆడపిల్లకి ఎంతో గొప్ప సంబంధం చెయ్యగలం. కానీ మీ పిసినారితనంతో ఆడపిల్లకి కట్నం లేకుండా దొరికిన అల్లుడ్ని తెచ్చుకుని చేతులు దులుపుకున్నారు.

మీరు చేసినదానికి ఆడపిల్ల చాలీచాలని తిండి తింటూ, జీవితాంతం దరిద్ర్యం అనుభవిస్తూ నిత్యం "మా నాన్న చేసిన దిక్కుమాలిన పెళ్లి" అని తిట్టుకుంటూ ఏడుస్తూ కాలం గడపవలసివచ్చేదికదా?

కానీ మీ కొడుకులు, చెల్లెలి పరిస్థితి, బాధ అర్థం చేసుకుని, దాని భవిష్యత్‌ని దృష్టిలో పెట్టుకుని అతన్ని ప్రోత్సహించి, చదివించబట్టే ఈనాడు అదే బ్యాంక్‌లో క్లర్కుగానన్నా వున్నాడు. వాళ్లేం దుబారా చేశారో, ఏం తగలపెడుతున్నారో ఇప్పుడు చెప్పండి?

కట్నాలు తేకపోయినా కొడుకులు, కోడళ్ళు ఒకరినొకరు అర్థం చేసుకున్నారు గనక ఆ దంపతులు ఎంత ఆనందంగా వున్నారో చూడండి! నా జీవితంలో నాకు లభించనిది, నేను పోగొట్టుకున్నది నా పిల్లలు పొంది, ఆనందంగా అనుభవిస్తుంటే నా జీవితం ధన్యమయిందని రోజూ పొంగిపోతూ వుంటానండీ! బ్రతికుండగానే అనుభవించిందే మనదండీ!

తినకుండా దాచి, దాచి ఏం చెయ్యాలి? అది మనదెలాగవుతుంది? పక్కింట్లో వున్న సరుక్కి మన బ్యాంక్‌లో వున్న డబ్బుకీ తేడా ఏమిటి? ఇకముందన్నా మీరూ నాలా ఆలోచించి, పిసినారి ఒంటరిపక్షిలా వేరే గదిలో ఇలా కూర్చోకుండా, పిల్లలకింకా దూరం కాకుండా వారిలో ఒకరై కలిసి ఈ ఆనందాన్ని పంచుకోండి!

నన్ను ఆప్యాయతతో చూస్తున్నట్లే మిమ్మల్నీ పిల్లలు ఆదరిస్తారు. మన చివరిదశ వారి చేతుల్లో హాయిగా గడవాలి" అంటూ భార్య చేసిన హితబోధ మంత్రాల్లా సోకగానే తాను చేసిన తప్పుని అర్థం చేసుకుని ఇన్నేళ్ళనుంచీ జీవితంలో దేన్ని పోగొట్టుకున్నదీ గ్రహించి, తల ఊపడమే కాకుండా, ఆ సాయంత్రమే వెళ్ళి కొడుకులిద్దరికీ, కూతురికీ మూడు కార్లు బుక్‌చేసి, లాయర్‌తో సంప్రదించి పిల్లలి ముగ్గురి పేర తన ఆస్తి రాసే ఏర్పాటుచేసి, త్వరలో రాబోయే పండక్కి ఇంట్లో అందరికీ ఖరీదైన బట్టలతోపాటు, స్వీట్లు, పళ్లు, మనవడికి ఆటవస్తువులతో వచ్చిన ధర్మారావుని చూసి కొడుకులు ఆశ్చర్యంగా చూస్తుంటే, తాయారు భర్తలో వచ్చిన మార్పుకి ఆనందపడిపోతూ నిండుగా నవ్వుకుంది.

– స్వాతి, ఫిబ్రవరి 1994